ప్రజాశక్తి

మంగళవారం 4 జూన్ 2024

కౌంటింగ్ ఏర్పాట్లను తెలియజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడికి సమయం ఆసన్నమైంది. ఓటు ద్వారా ప్రజలిచ్చిన తీర్పు వెలువడేందుకు ఇక కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. మే 13వ తేదీన ఓటర తన ఓటు ద్వారా తీర్పునిచ్చాడు. ఆ తీర్పు ఫలితం మరో రెండు, మూడు గంటల్లో వెల్లడి కానుంది. ఇవిఎంలో నిక్షిప్తమైన ప్రజా తీర్పు వెలువడేందుకు సమయం ఆసన్నమవడంతో అందరిలోనూ ఒకే ఉత్కంఠత కన్పిస్తోంది. ఎన్నికల సందర్భంగా ప్రజలు ఏమి ఆలోచించారన్నది మంగళవారం నాడు జరగనున్న ఓట్ల లెక్కింపుతో తేలనుంది. ఓటరు నిక్షిప్తం చేసిన తీర్పు నేడు విడుదల కానుండడంతో అటు అభ్యర్థులు, ఇటు ప్రజలందరిలోనూ టెన్షన్ వాతావరణం నెలకొంది.

- ◆ అందరిలోనూ టెన్షన్...టెన్షన్...
- ◆ ప్రజాతీర్పు నేడు వెల్లడి
- ◆ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ◆ ఉదయం 7 నుంచే కౌంటింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అసెంబ్లీ బరిలో అభ్యర్థులు
113
అనంతపురం పార్లమెంటుకు అభ్యర్థులు : 21

సత్యసాయి జిల్లా అసెంబ్లీ బరిలో అభ్యర్థులు
78
హిందూపురం పార్లమెంటుకు అభ్యర్థులు : 13

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లను చేసింది. ఇంకోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలింగ్ రోజు తాడిపత్రిలో జరిగిన ఘటనలు వంటివి మరోమారు పునరావృతం కాకుండా అవసరమైన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేశారు. అనంతపురం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జెఎన్‌టియులో ఓట్ల లెక్కింపు జరగనుంది. సత్యసాయి జిల్లాలో హిందూపురం, లేపాక్షి రెండు ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం చుట్టూ అనుమతి ఉన్న వారిని తప్ప తక్కిన వారెవ్వరని అటువైపు అనుమతించడం లేదు. చుట్టూ దుర్భేధ్యమైన రక్షణను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వైపు వచ్చే అన్ని దారులను మూసివేశారు. సత్యసాయి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 14,06,204 మంది ఓటర్లు ఉండగా 11,92,287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. హిందూపురం పార్లమెంట్‌కు 13 మంది బరిలోనున్నారు. అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20,18,162 మంది ఉండగా 16,36,315 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి అసెంబ్లీకి 113 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అనంతపురం పార్లమెంటుకు 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరందరి భవితవ్యం నేడు తేలనుంది.

సర్వత్రా ఉత్కంఠ..!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అనేక ఊహగానాలు, అంచనాలూ ఉన్నాయి. 2019లో ఉమ్మడి జిల్లాలో ఫ్యాన్ గాలి బలంగా వీచింది. 14 అసెంబ్లీకు 12 స్థానాల్లో వైసిపి గెలుపొందింది. అదే విధంగా రెండు పార్లమెంటు స్థానాలనూ దక్కించుకుంది. ఈసారి ఫలితం ఏ రకంగా ఉండనుందన్నది సర్వత్రా ఉత్కంఠత రేపుతోంది. ఈసారి ఫలితం ఏ రకంగా ఉంటుందన్న దానిపై ఎవరి అంచనాలు వారికున్నాయి. ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు వారి అంచనాలను వెల్లడించాయి. అయితే అసలైన ఫలితం నేడు రానుంది. ఇది ఏ రకంగా ఉంటుందన్నది కొన్ని గంటల్లోనే తేలనుంది.

హిందూపురంలో కౌంటింగ్‌కు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్

అనంతపురం జిల్లా కౌంటింగ్ వివరాలు

నియోజకవర్గం	అభ్యర్థులు	పోస్టల్ బ్యాలెట్	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాయదుర్గం	13	1671	2,27,189	14	22
ఉరవకొండ	11	2544	1,92,441	18	15
గుంతకల్లు	14	3612	2,03,820	14	20
తాడిపత్రి	18	2702	2,06,701	14	20
శింగనమల	14	2450	2,05,642	14	21
అనంతపురం	15	6971	1,83,019	14	21
కళ్యాణదుర్గం	15	2614	2,04,297	14	19
రాప్తాడు	13	2614	2,13,207	14	21

శ్రీ సత్యసాయి జిల్లా కౌంటింగ్ వివరాలు

నియోజకవర్గం	అభ్యర్థులు	పోస్టల్ బ్యాలెట్	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
ధర్మవరం	15	2628	2,18,282	14	21
కదిరి	13	3412	2,06,208	14	21
పెనుకొండ	09	2240	2.05.213	14	19
హిందూపురం	13	2054	1,93.882	14	19
మడకశిర	13	1376	1,84,454	14	18
పుట్టపర్తి	15	2318	1,82,083	14	18

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. కౌంటింగ్ నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ లు, కెమెరాలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లరాదన్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకే అధికారులు, ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. లేపాక్షి సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాలకు హిందూపురం సమీపంలోని మలుగూరు వద్ద గల బిట్ కళాశాలలో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పార్లమెంట్ స్థానానికి కూడా ఓట్ల లెక్కింపు ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఒక కిలోమీటర్ వరకు ఇతరులకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగంచెల భద్రత ఉంటుందన్నారు. కేంద్ర బలగాలు, ఆర్మీ పోలీసులు, సివిల్ పోలీసులు కేంద్రాలలోని సిబ్బంది సుమారు 2000 మంది ఉంటారన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ఈనెల 6 వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ తో పాటు 30 యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. గొడవలకు ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పట్టణాల్లో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

పటిష్ట భద్రత : ఎస్పీ

కౌంటింగ్ సందర్భంగా హిందూపురం, లేపాక్షిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. హిందూపురంలోని బిట్స్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ బందోబస్తు విధులపై సోమవారం నాడు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ సందర్భంగా ప్రతి పోలీస్ ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ సెంటర్ లోపలికి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసి వారి వద్ద అనుమతి పాసులు ఉంటేనే పరిశీలించి లోపలికి పంపాలన్నారు. మొబైల్ ఫోన్స్,ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. 144సెక్షన్ అమలలో ఉన్నందున 4 కంటే ఎక్కువ మంది ఉండకుండా చూడాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అందరూ బాగా సమిష్టితో పనిచేయాలని ఎస్పీ గారు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.విష్ణు సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కదిరిలో విజయం ఎవరిని వరించేనో?

ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి-కదిరి టౌన్

2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కదిరి నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారనే ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది. కదిరి అసెంబ్లీ స్థానానికి టిడిపి తరఫున కందికుంట వెంకటప్రసాద్, వైసిపి అభ్యర్థిగా బిఎస్ మక్బూల్ అహ్మద్, ఇండియా వేదిక (కాంగ్రెస్ పార్టీ) తరపున కేఎస్ షానవాజ్ పోటీ చేశారు. మే 13వ తేదీ పోలింగ్ జరిగింది. ఈవీఎంలను హిందూపురం పరిధిలోని బిట్స్ కళాశాలలో భద్రపరిచారు. నియోజకవర్గానికి సంబంధించి 281 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం 14 టేబుళ్లలో 21 రౌండ్లుగా జరగనుంది. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 2,53,420 ఉండగా 2,09,971 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఇక పోస్టల్ బ్యాలెట్లు 3,380, సర్వీస్ ఓట్లు 224, ఇంటి వద్ద వినియోగించుకున్న ఓట్లు 153. మొత్తం పోలైన పురుషుల ఓట్లు 1,02,411, మహిళల ఓట్లు 1,03,796, ఇతరులు 7మంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించనున్నారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లకు సంబంధించి ముందుగా తలుపుల మండలం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. అయితే విజయం ఎవ రిని వరిస్తుందోనని అభ్యర్థులే కాకుండా ప్రజలు, బెట్టింగ్ జూదరులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

కూలీలకు 'ఉపాధి' కల్పించాలి

వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న

కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి-గోరంట్ల

గ్రామాల్లోని ప్రతి కూలీకి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పనులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మండలంలోని నర్సంపల్లి పంచాయతీ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలు అడిడి తెలుసుకున్నారు. పెద్దన్న మాట్లాడుతూ నర్సంపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉన్నందున రెండు రోజులకు ఒకసారి మాత్రమే కూలీలకు పనులు కల్పిస్తున్నారని, దీని వల్ల ఉపాధి కూలీలకు కూలి గిట్టడం లేదన్నారు. ఈ విషయంపై ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఫిర్యాదు చేయగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు వాపోయారు. ప్రస్తుతం ఉపాధి పనులను నిలిపివేయడం సరికాదన్నారు. ఈ విషయంపై మండల ఉన్నతాధికారులు స్పందించి కూలీలకు పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యుడి జిల్లా బహిష్కరణ

పోలింగ్ రోజు దాడి ఘటనలో పోలీసుల చర్యలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పూల శ్రీనివాసులురెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ(మంగళవారం) సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు, కదిరి అసెంబ్లీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల శ్రీనివాసులురెడ్డిని నెల రోజులు పాటు జిల్లా బహిష్కరణ చేసినట్లు సోమవారం పోలీస్ అధికారులు తెలిపారు. వివరాలు.. గత నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లెలో ఓ పోలింగ్ బూత్ వద్ద పూల శ్రీనివాసులురెడ్డి టిడిపి నాయకులపై హత్యయత్నానికి పాల్పడ్డారు. విచక్షణ కోల్పోయి వారిపై దాడికి పాల్పడి పోలింగ్ బూత్ వద్ద ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించాడు. కేకలు వేస్తూ మీ అంతు చూస్తానని బెదిరింపులకు సైతం పాల్పడ్డారు. దీంతో నేడు జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పూల శ్రీనివాసులురెడ్డిని నెల రోజులు పాటు బహిష్కరణ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలేపల్లి తండాలో నీటి ఎద్దడి

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని బాలేపల్లి ఎగువతాండాలో నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. గ్రామంలో దాదాపు 260 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బోరుబావుల్లో నీటి వన రులు తగ్గిపోవడంతో విధి లేని పరిస్థితుల్లో సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు మానవతా దృక్పథంతో ప్రజల దాహార్తి తీరుస్తున్నాడు. సదరు రైతు తన పొలంలోని వ్యవసాయ బోరుబావి మోటార్‌ను ప్రజల అవసరాల కోసం ఆన్ చేస్తున్నారు. తండాలో నీటి ఎద్దడి గురించి సంబంధిత అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకునే వారు లేరన్నారు. ఇకనైనా ఉన్నతాధి కారులు స్పందించి తండాలో నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి కోసం ఇబ్బంది పడుతున్న బాలేపల్లి తండా వాసులు

గోవా మంత్రి విశ్వజిత్‌రాణేను సత్కరిస్తున్న ఈవో, అర్చకులు

దుర్గావీరభద్రస్వామి సన్నిధిలో గోవా మంత్రి

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో వెలిసిన దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని సోమవారం గోవా రాష్ట్రానికి చెందిన ఆరోగ్య, పట్టణాభివృద్ధి, మహిళలు, శిశు అభివృద్ధి, అటవీ శాఖ మంత్రి విశ్వజిత్ రాణే సందర్శించారు. ముందుగా మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయం విశిష్టతను తెలియజేసి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రిని ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహమూర్తి, అర్చకులు సింహస్వామి, శీనస్వామి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కమాండ్ కంట్రోల్ నుంచి నిరంతర నిఘా

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

కమాండ్‌కంట్రోల్ నుంచి లైవ్ లోకేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

కౌంటింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి నిరంతరం సిసి కెమెరాల ద్వారా నిఘా పర్యవేక్షణ ఉంటుందని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌంటింగ్ సందర్భంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఇక్కడ నుండి జిల్లా వ్యాప్తంగా ఉన్న మ్యాట్రిక్ కెమెరాల అబ్జర్వేషన్, సోషల్ మీడియా, టీవీల ద్వారా రెచ్చగొట్టే ప్రకటనలు, కౌంటింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అధికారులు నిర్వహిస్తున్న విధులు, తదితర వంటివి లైవ్లో లొకేషన్లు చూసే విధంగా కమాండ్ కంట్రోల్ నుండి సీసీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ తెలిపారు. విధులు నిర్వహించే సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని పై అధికారులకు తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే ప్రకటనలు గ్రూపులో షేర్ చేస్తే గ్రూప్ అడ్మిన్ పై కఠిన చర్యలు తీసుకోవడమే గాక కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి బాలసుబ్రమణ్యం రెడ్డి, సైబర్ క్రైమ్ సీఐ హేమంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నేతకు సవితమ్మ పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బోయ తిమ్మయ్య కాలికి ప్రమాదవశాత్తూ గాయం కావడంతో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి పొందుతున్నాడు. విషయం తెలుసుకొన్న పెనుకొండ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ సోమవారం ఆ గ్రామం వెళ్లి తిమ్మయ్యను పరామర్శించారు. ఆమె వెంట టిడిపి మండల నాయకులు చిన్నప్పయ్య, నరహరి, నరసింహులు, టైలర్ ఆంజనేయులు, మాధవనాయుడు, కంబాలపల్లి సర్పంచి మంజు, హరీష్, రుద్ర, కార్యకర్తలు ఉన్నారు.

టిడిపి నాయకున్ని పరామర్శిస్తున్న సవితమ్మ

నేటితో ఉత్కంఠకు తెర..!

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
తొలి ఫలితం మడకశిర లేదా పుట్టపర్తి

హిందూపురం బిట్ కళాశాలలోని కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల సంగ్రామం చివరి దశకు చేరుకుంది. గత నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ ముగిసింది. అప్పటి నుంచి 20 రోజుల పాటు రాజకీయ పార్టీలు ఫలితాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. అయితే ఆ రోజు రానే వచ్చింది. కొన్ని గంటల్లోనే అభ్యర్థుల భవితవ్యం వెల్లడి కానుంది. అధికార యంత్రాంగం ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. శ్రీ సత్య సాయి జిల్లాకు సంబంధించి హిందూపురం రూరల్ మండల పరిధిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో, లేపాక్షి మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సర్వం సిద్ధం చేసినట్లు ఇప్పటికే అధికార యంత్రాంగం ప్రకటించింది. ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు హిందూపురం లోక్ సభ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరగనుండగా లేపాక్షి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాలతో పాటు హిందూపురం పార్లమెంటు స్థానం ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేశారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌ను విడివిడిగా లెక్కించేందుకు ఏర్పాటు చేశారు. ఇందుకోసం దాదాపు 750 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్ల ఆధారంగా రౌండ్‌లను నిర్ణయించారు. ఒక్కో రౌండ్ ఓట్ల లెక్కింపు కోసం దాదాపు అరగంట సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా అధికారులు, కౌంటింగ్ ఏజెంట్లు ఆరు గంటల లోపు లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలన్న సమాచారాన్ని అధికార యంత్రాంగం ఇప్పటికే రాజకీయ పార్టీలకు చేరవేసింది. శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, మడకశిర, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు హిందూపురం ప్రాంతంలో చేపట్టనున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 290 పోలింగ్ కేంద్రాలు ఉండగా 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,18,282 ఓట్లు పోలయ్యాయి. 2,628 పోస్టల్ బ్యాలెట్లు, 369 హోం ఓట్లు, 258 సర్వీస్ ఓట్లు ఉన్నాయి. 21 రౌండ్లలో ఆ నియోజకవర్గ ఫలితం తేలనుంది. అదేవిధంగా కదిరి నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందుకోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆ నియోజకవర్గంలో 2,06,208 ఓట్లు పోలయ్యాయి. 3412 పోస్టల్ బ్యాలెట్లు, 377 హోం ఓట్లు, 262 సర్వీస్ ఓటర్లు ఉండగా కూడా 21 రౌండ్లలో ఫలితం వెల్లడి కానుంది. అలాగే పెనుగొండ నియోజకవర్గంలో 265 పోలింగ్ స్టేషన్లు ఉండగా 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 19 రౌండ్లలో ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు. ఆ నియోజకవర్గంలో మొత్తం 2,05,213 ఓట్లు పోలయ్యాయి. 2240 పోస్టల్ బ్యాలెట్లు, 279 హోం ఓట్లు, 203 సర్వీస్ ఓట్లు ఉన్నాయి. ఇకపోతే హిందూపురం నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,93, 882 ఓట్లు పోలయ్యాయి. 2054 పోస్టల్ బ్యాలెట్లు, 219 హోం ఓట్లు, 87 సర్వీస్ ఓట్లు ఉండగా అధికార యంత్రాంగం 14 టేబళ్లను ఏర్పాటు చేసి 19 రౌండ్లలో ఫలితాన్ని ప్రకటించనుంది. మడకశిర నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,84,454 ఓట్లు పోలయ్యాయి. 1376 పోస్టల్ బ్యాలెట్లు, ~ 386 హోం ఓట్లు 79 సర్వీస్ ఓట్లు ఉన్నాయి. 14 టేబుల్స్ ద్వారా 18 రౌండ్లలో ఫలితాలను ప్రకటించనున్నారు. పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 18 రౌండ్లలో ఫలితాలను ప్రకటించనున్నారు. ఆ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,82, 083 ఓట్లు పోలయ్యాయి. 2318 పోస్టల్ బ్యాలెట్లు, 490 హోం ఓట్లు, 258 సర్వీస్ ఓట్లు ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లాలో తొలుత మడకశిర లేదా పుట్టపర్తి ఫలితం వెల్లడి కానుంది. అత్యధిక పోలింగ్ కేంద్రాలు ఉన్న ధర్మవరం, కదిరి నియోజకవర్గం ఆఖరిలో వెల్లడి కానున్నాయి. జిల్లా పరిధిలో మొత్తం 14,06,204 మంది ఓటర్లు ఉండగా గత నెల 13వ తేదీన జరిగిన పోలింగ్ లో 11,92,287 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ కోసం ఈవీఎంలకు సంబంధించి ప్రతి టేబుల్‌కు గెజిటెడ్ అధికారి, సూపర్‌వైజర్, సహాయకుడు, జూనియర్ సహాయకుడు, సూక్ష్మ పరిశీలకుడిని నియమించారు. హిందూపురం పార్లమెంటు సంబంధించి 20 టేబుళ్లను ప్రతి అసెంబ్లీ స్థానాలకు మూడు చొప్పున ఏర్పాటు చేశారు.

భారీ పోలీసు భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ యంత్రాంగం ఇప్పటికే భారీ భద్రతను ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ను అమలు చేస్తోంది. ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయగా కౌంటింగ్ ఏజెంట్లు అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు కౌంటింగ్ హాలుకు చేరుకునేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కలెక్టర్ అరుణ్ బాబు తో పాటు డిఐజి, ఎస్పీ మాధవరెడ్డి పలుమార్లు కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసి తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై తగిన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంది.

ఎగ్జిట్ పోల్స్ పై బేరీజు..

రాజకీయ పార్టీల నాయకులు తాజాగా విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాల లెక్కలు వేసుకుంటూ గెలుపు తమదేనని ఓట్ల లెక్కింపు లాంఛనమే అనిసంబరపడి పోతున్నారు. పలు సర్వే సంస్థలు అధికార వైసిపికి అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించగా... మరికొన్ని సర్వే సంస్థలు కూటమికి అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించాయి. దీంతో ఆయా రాజకీయ పార్టీలు తమకే ఎగ్జిట్ పోల్స్‌తో పాటు వాస్తవ ఫలితాలు కూడా అనుకూలంగా ఉంటాయని, తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను సామాన్యులు చూసి సర్వే సంస్థలు ఏ పార్టీ వారు ఆ పార్టీకి అనుకూలంగా ఇచ్చారని వ్యాఖ్యానిస్తున్నారు.

మృతిచెందిన గొర్రెలు

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని ఇందిరానగర్ లో ఆదివారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో తనకల్లుకు చెందిన మౌలాలి అనే గొర్రెల కాపరికి చెందిన 8 గొర్రెలు మృతిచెందాయి. మృతిచెందిన గొర్రెల విలువ లక్షరూపాయలు ఉంటుందని వెటర్నరీ ఎడి అంచనా వేశారు. ప్రభుత్వం స్పందించి నిరుపేద గొర్రెల కాపరిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కలుషిత ఆహారం తిని అస్వస్థత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలం మంగలమడక గ్రామంలో ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులు ఆదివారం విషాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. వారు తమ ఇంట్లో వండుకున్న ఆహారం తిని సోమవారం తెల్లవారుజామున నుండి వాంతులు విరేచనాలతో ఆసుపత్రికి చేరారు. ఒకే కుటుంబానికి చెందిన పద్మావతి, రామచంద్రమ్మ, జయరాజు, నిఖిల్ అస్వస్థతకు గురవటంతో మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లి ఆర్‌డిటి ఆస్పత్రికి తరలించారు.

నిల్వ ఉంచిన టపాసులు సీజ్

ప్రజాశక్తి:- చిలమత్తూరు

మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల ఓ కిరాణ షాపులో నిల్వ ఉన్న 89,650 రూపాయల విలువచేసే టపాసులను సీజ్ చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఎంసిసి టీముకు వచ్చిన సమాచారం మేరకు ఎన్నికల నిబంధనల లో భాగంగా టపాసులను సీజ్ చేసి నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను చూపిస్తున్న పోలీసులు

నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న కార్మికులు

రోడ్లపైకి వర్షం నీరు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి బస్టాండ్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రధాన రహదారి మొత్తం వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యపై పలువురు మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి రోడ్లపై ఉన్న వర్షపు నీటిని చిన్న చిన్న కాలువల ద్వారా ప్రక్కకు తొలగించే చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ప్రధాన రహదారిలో వర్షపు నీరు ఎక్కడైనా నిలిస్తే వెంటనే అక్కడ నీటి నిల్వ ఉండకుండా పక్కకు మళ్లించాలని సిబ్బందికి సూచించారు.

ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు సోమవారం మండల పరిధిలోని కటారపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కదిరి ఎడిఎ సత్యనారాయణ, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జాన్ సుధీర్, డాక్టర్ రామసుబ్బయ్య తదితరులు హాజరై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. విత్తన శుద్ధి, భూసార పరీక్షలు బట్టి ఎరువులు వాడకం తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ లక్ష్మిప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారి

కరాటేతో ఆత్మరక్షణ

ప్రతిభా విద్యార్థులతో 'కందికుంట'

ప్రజాశక్తి - కదిరి టౌన్

కరాటేతో ఆత్మరక్షణ కలుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరి బాయ్స్ హైస్కూల్ లో కియో జపాన్ షోటో ఖాన్ కరాటే డు అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో మాస్టర్ అక్బర్ అలీ నిర్వహించిన కరాటేబెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని పంచస్ కిక్స్, బ్లాకింగ్స్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, నాంచాక్ రొటేషన్ ట్రైల్స్, బ్రేకింగ్ కథస్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. వీరందరికీ కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా కందికుంట మాట్లాడుతూ కరాటే సాధనతో విద్యార్థులు శారీరకంగా మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఉల్లాసంగా ఉత్సాహంగా కూడా ఉంటారని అన్నారు. కరాటే కాన్ఫిడెంట్ లెవెల్స్‌ను పెంచుతుందన్నారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు పాల్గొని ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే శిక్షణ ఇచ్చిన మాస్టర్ అక్బర్ అలీని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్‌లు రియాజ్ అలీ ఖాన్, వసుంధర, హారిక, పవన్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాగ్యరేఖ

కౌంటింగ్‌కు సహకరించాలి : ఆర్డీవో

ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్

2024 సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో, బయట కాని ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా అందరూ సహకరించాలని ఆర్డీవో భాగ్యరేఖ, పుట్టపర్తి డీఎస్పీ కోరారు.. మంగళవారం ఉదయం 8 గంటలకు చోళ సముద్రం సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న తరుణంలో అభ్యర్థులకు ఏజెంట్లకు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులు , ఏజెంట్లు వారి గుర్తింపు కార్డు, ఎలక్షన్ గుర్తింపు కార్డు నోట్ బుక్,పెన్ తీసుకురావాలన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు కౌంటింగ్ హాల్ నందు నిషిద్ధమన్నారు. పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూమును అభ్యర్థులు, పోలీసు, తహశీల్దార్ల సమక్షంలో తెరుస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని,ఎన్నికల కోడ్ ఉన్నందున ఊరేగింపులు, ర్యాలీలు నిషిద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, వేణుగోపాల్, భారతి, కళావతి, నాగభూషణతో పాటు పలువురు అధికారులు, ఎన్నికల ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణం లో యువర్స్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఈనెల 8న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు యువర్స్ పౌండేషన్ అధ్యక్షకార్యదర్శులు శీలానాగేంద్ర, జయరాం తెలిపారు. ఈమేరకు వారు సోమవారం స్థానిక స్వాతిక్లినిక్ లో ఉచిత కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా కంటి వైద్యశిబిరాలు నిర్వహించి కంటిచూపు మందగించిన వారికి శస్త్రచికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు.కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ కోశాధికారి బండి నాగేంద్ర, క్యాంప్ చైర్మన్ శ్రీకాంత్రెడ్డి, సభ్యులు చాంద్‌బాషా, డాక్టర్ బీవీసుబ్బారావు, రమేష్‌బాబు, ఖలీల్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి - బత్తలపల్లి

రుతుపవనాలు ప్రవేశంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సోమవారం తెల్లవారుజామున మండలంలో గంటన్నరపాటు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. రెండు నెలలుగా ఎండలు వడగాల్పుల ఉధృతితో విలవిల లాడిని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బత్తలపల్లి మండలంలో 29.2 మిల్లీ మీటర్లు, తాడిమర్రి మండలంలోని 28.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఈవర్షంతో మెట్ట. మాగాణి భూములు దుక్కులు దున్ని వ్యవసాయ పనులు చేపట్టేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సీడీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తన కాయలను అందిస్తోందని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు.

పింఛను కోసం అగచాట్లు

ప్రజాశక్తి బత్తలపల్లి

సామాజిక పింఛన్లు తీసుకోవటానికి లబ్ధిదారులు నానా పాట్లు పడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి ఎన్నికల కమిషన్ వాలంటీర్లను దూరం పెట్టిన నేపథ్యంలో లబ్దిదారులు ఏప్రిల్ నెల నుంచి పింఛనును బ్యాంకులకు, సచివాలయానికి వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సచివాలయం దాకా నడవలేక మధ్యలో ఆగుతూ కాసేపు సేద తీరుతున్నారు. నానా కష్టాలు పడి ఎలాగోలా గ్రామ సచివాలయాలకు చేరుకుని పింఛను సచివాలయాల్లోని మెట్లు ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లేపాక్షి చెరువులో యువకుడి మృతదేహం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక పెద్దచెరువులో చేపలు పట్టడానికి వెళ్లి లేపాక్షి గ్రామానికి చెందిన రవికుమార్(32) మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దచెరువులో సోమవారం ఓ పురుషుడి మృతదేహం తేలి ఉండడం గమనించిన గ్రామస్తులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకొని చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి విచారణ చేపట్టారు. దీంతో మృతి చెందిన వ్యక్తి లేపాక్షి గ్రామానికి చెందిన రవికుమార్‌గా స్థానికులు, బంధువులు తెలపడంతో మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి వివాహమైనా ప్రస్తుతం భార్య నుంచి దూరంగా ఉంటున్నారు. అతడి మృతికి కారణాలు తెలియరాలేదు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి విద్యార్థి మృతి

నార్పల : మండల కేంద్రంలోని కొండంక వద్ద నివాసం ఉన్న పల్ల నారాయణస్వామి మనువడు మెకానిక్ గాండ్ల లక్షీపతి కుమారుడు రాజేష్ (16) తన తోటలో ప్రమాదవశాత్తు బావిలో కాలుజారి పడి మృతిచెందాడు. రాజేష్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయింది. చేతికందిన కుమారుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

'పురం' చేరుకున్న బాలయ్య

ప్రజాశక్తి-హిందూపురం

మంగళవారం నిర్వహించనున్న కౌంటింగ్ నేపథ్యంలో హిందూపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యరి బాలకృష్ణ సోమవారం హిందూపురం చేరుకున్నారు. ఈసందర్భంగా బాలయ్యకు టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్పతో పాటు టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలయ్య ఎంపిక చేసిన కౌంటింగ్ ఏజెంట్లు, నాయకులతో కౌంటింగ్ తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, నంబూరి సతీష్ కుమార్, చంద్రమోహన్ యాదవ్, అజ్మతుల్లా, బేవిన హళ్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాలయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఓబుళదేవర చెరువులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వంశీకృష్ణ హెచ్చరించారు. సోమవారం స్థానిక స్థానిక వైయస్సార్ సర్కిల్లో వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణానికి సహకరించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు, ఫలితాల తర్వాత కూడా గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలం అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు ఆంక్షలు అమలులో ఉన్నాయన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మండలంలో ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించాలని ఎస్ఐ శ్రీనివాసులు కోరారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆయన తమ సిబ్బందితో కలిసి వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు. మంగళవారం మండలంలోని గ్రామాల వారీగా దుకాణాలు మూసి ప్రశాంత వాతావరణానికి పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. ఫలితాల తదుపరి బాణాసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం, రంగులు చల్లుకోవడం. కవ్వింపు చర్యలకు పాల్పటడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారు ఎవరైనా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి వివరాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసుల ఉత్తర్వులు ఉల్లంఘిస్తే సదను వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు.

తలుపుల : ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు. మంగళవారం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఏర్పడి ప్రజాశాంతికి భంగం కలిగించరాదన్నారు. కౌంటింగ్ సందర్భంగా మండల పరిధిలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.